ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
గురువారం 25 జూలై 2024



ఆవేదనకు లోనైన జనం

నిందితుల గ్రామ బహిష్కరణ





ఆటోడ్రైవర్ తాడిమర్రి సూర్య నారాయణ(ఫైల్)

ఒక ఊరిలో..

అనుకోకుండా ఓ హత్య

చిత్రావతి ఒడ్డున ఉండే అందమైన పల్లెటూరు అది. చెన్నేకొత్తపల్లి మండలంలో.. మారుమూలన ఉండే ఆ ఊరి పేరు వెల్దుర్తి. సుమారు ఐదొందల గడపలు, పన్నెండొందల మంది ఓటర్లు ఉంటారు. ఆ ఊరు ఒక్కటే ఒక పంచాయతీ..! ఐదెకరాల నుంచి పదెకరాల వరకూ పొలాలు ఉండే రైతులు ఎక్కువ. ఇరవై.. ముప్పై ఎకరాల పొలాలు ఉండేవారు అతికొద్ది మంది ఉంటారు. అన్ని ఊర్లలో మాదిరి భిన్నమైన సామాజికవర్గాలు ఉన్నాయి. కానీ అరుదుగా ఉండే ఐక్యత, శాంతిసామరస్యాలు ఈ ఊరి సొంతం. అలాంటి ఊరిలో అనుకోని సంఘటన జరిగింది. మునుపెన్నడూ లేని విధంగా.. ఆ ఊరికి వలస వచ్చి.. ఆటో నడుపుతూ, భార్యాబిడ్డలను పోషించుకుంటున్న సూర్యనారాయణ హత్యకు గురయ్యాడు.

ఒక హత్యతో...

ధర్మవరం మండలం సీసీ కొత్తకోట వద్ద ఈ నెల 20న సూర్యనారాయణ హత్య జరిగింది. పోలీసులు దర్యాప్తు ప్రారంభించి.. నిందితులను గుర్తించారు. పొలం తగాదా కారణంగా సూర్యనారాయణను సొంత బావమరిది మల్లికార్జున, ఆయన కుమారుడు రాము, అల్లుడు రాజు, బంధువు లక్ష్మీనారాయణ హత్య చేసినట్లు గుర్తించారు. వారిని ఈ నెల 22న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఇన్నాళ్లూ ఏ గొడవలూ ఎరుగని ఆ ఊరి జనం.. ఈ హత్యతో తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. ఎప్పుడూ లేనిది పచ్చటి పల్లెకు రక్తపు మరకలు అంటడాన్ని జీర్ణించుకోలేకపోయారు. వారి ఆవేదన ఆగ్రహంగా మారింది. 'ఊరికి చెడ్డపేరు తెచ్చిన ఇలాంటివారు ఇక్కడ ఉండటానికి వీల్లేదు..' అని తీర్మానం చేసుకున్నారు. నిందితులకు సంబంధించిన ఓ దుకాణానికి నిప్పు పెట్టారు. వామి దొడ్లో బండలను పగులగొట్టారు. నిందితుల ఇళ్ల వద్దకు వెళ్లి.. వారి కుటుంబ సభ్యులను ఊరి నుంచి బయటకు పంపించారు.



గ్రామస్థులు నిప్పు పెట్టడంతో తగలబడిపోయిన దుకాణం

● ఆగ్రహానికి కారణం ఇదే..

వెల్దుర్తి జనం భూమిని నమ్ముకుని బతుకుతున్నారు. తమ బిడ్డలను చదివించి, సంస్కారవంతులుగా తీర్చిదిద్దుతున్నారు. చాలా కుటుంబాలలో ఉపాధ్యాయులు, ఆర్మీ, బీఎస్ఎఫ్ జవాన్లు ఉండటం ఇందుకు నిదర్శనం. రాజకీయాలపరంగానూ ఇక్కడ ఎంతో సామరస్యం కనిపిస్తుంది. ఊరిలో వైసీపీ, టీడీపీ సహా అన్ని పార్టీల మద్దతుదారులు ఉన్నారు. కానీ ఎన్నికల సమయంలో తప్ప వారు రాజకీయాల గురించి పట్టించుకోరు. నచ్చిన పార్టీలకు ఓటేస్తారు. ఆ ప్రభావం ఎక్కడా కనిపించదు. అందరూ కలిసిమెలిసి జీవిస్తారు. ఇలాంటి ఊరులో అలాంటి ఘటన జరగడంతో జనం ఆగ్రహించారు.



దుకాణాన్ని ధ్వంసం చేస్తున్న గ్రామస్థులు

నిందితులను గ్రామ బహిష్కరణ చేయడం చట్టపరంగా సరికాదు. కానీ, ఆ నిర్ణయం వెనుక వారి ఉద్దేశం మాత్రం సుస్పష్టం..! 'మా ఊరిలో గొడవలకు చోటు లేదు. నేరాలకు అస్సలు చోటు లేదు. వాటితో సంబంధం ఉన్నవారికి, ఆ మార్గంలో నడిచేవారికి కూడా మా ఊరిలో చోటు లేదు..' అని సందేశం ఇవ్వడమే..! భవిష్యత్తులో ఎవరూ గొడవల జోలికి వెళ్లకుండా చేయగలిగేంత కఠిన నిర్ణయం ఇది. అయినా.. ఊరి జనం ఇంకోసారి ఆలోచించాలి.

ఇదే చివరిది కావాలి..

నేరస్థులను శిక్షించే బాధ్యత న్యాయ వ్యవస్థ తీసుకుంటుంది. ఇప్పటికే చట్టపరంగా తాము చర్యలు తీసుకున్నామని పోలీసులు ఆ ఊరి జనానికి చెప్పారు. సంయమనం పాటించాలని కోరారు. అనుకోకుండా జరిగిన ఆ హత్యను పీడకలగా భావించి.. ఇంతటితో వదిలేయాలి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా.. తమ ఊరికి మరింత వన్నె తీసుకురావాలి. రాయలసీమ అంటే ఫ్యాక్షన్ గొడవలు అని ముద్రవేసేవారికి.. ఇక్కడి జనం శాంతిని ఎంతగా కోరుకుంటారో చెప్పిన ఊరు వెల్దుర్తి. అలాంటి ఊరిలో.. ఇదే చివరి గొడవ కావాలి..!

- చెన్నేకొత్తపల్లి

వేతన బకాయి కోసం దీక్ష

వైసీపీ హయాంలో సస్పెండ్ చేయించారు

చిరుద్యోగి ఆవేదన.. న్యాయం చేయాలని వినతి



దీక్ష చేస్తున్న అటెండర్ తిప్పేస్వామి

విడపనకల్లు, జూలై 24: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట అటెండర్ తిప్పేస్వామి బుధవారం నిరసన దీక్ష చేపట్టాడు. ప్రభుత్వం నుంచి 11 నెలల వేతనం అందాల్సి ఉందని, వెంటనే ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశాడు. గుంతకల్లులో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఇన్‌చార్జి తహసీల్దారు రాము, ఆర్డీఓ రవీంద్రస్వామి తనపై అవినీతి కేసు నమోదు చేయించి సస్పెండ్ చేయించారని వాపోయాడు. ఓ మహిళకు ఉద్యోగం ఇప్పించేందుకు లంచం అడిగానని కేసు నమోదు చేయించి, హింసించారని ఆవేదన వ్యక్తం చేశాడు. అంధుడైన తాను లంచం ఎలా అడగగలనని ప్రశ్నించారు. వైసీపీ నాయకుల ఒత్తిడితో తనను అక్రమంగా కేసులో ఇరికించారని ఆరోపించాడు. తనపై పెట్టిన కేసును హైకోర్టు కొట్టివేసిందని తెలిపాడు. తనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, బకాయి వేతనాన్ని ఇవ్వాలని కూడా హైకోర్టు ఆదేశించిందని తెలిపాడు. ఫిబ్రవరిలో తనకు విడపనకల్లు తహసీల్దారు కార్యాలయంలో విధుల్లో చేరాలని అధికారులు ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. అప్పటి నుంచి తనకు వేతనాలు ఇస్తున్నారని, కానీ 11 నెలల బకాయి ఇవ్వడం లేదని వాపోయాడు. తన సమస్యను చెప్పుకునేందుకు వెళితే.. డీఆర్వో కార్యాలయంలోకి అడుగు కూడా పెట్టనివ్వడం లేదని వాపోయాడు. తనకు బకాయి ఉన్న రూ.7 లక్షల వేతనం ఇప్పించాలని, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తనను ఆదుకోవాలని విన్నవించాడు.

పక్షం రోజులు టైం ఇస్తున్నా..!

- సజ్జల, పేర్నినానిపై చర్యలు తీసుకోవాలి
- పెద్దారెడ్డిని జిల్లా నుంచి బహిష్కరించాలి
- మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి
- అనుచరగణంతో డీఎస్పీ, ఎస్పీకి ఫిర్యాదు

అనంతపురం అర్బన్/తాడిపత్రి, జూలై 24: మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన కుమారులను జిల్లా నుంచి బహిష్కరించాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. తాడిపత్రి నుంచి భారీ కాన్వాయ్‌తో బుధవారం ఆయన అనంతపురానికి వచ్చారు. వందలాదిమంది అనుచరులతో కలిసి నల్లకండువాలు ధరించి.. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు జేసీ ప్రభాకరరెడ్డిని స్టేషన్‌లోనికి తీసుకువెళ్లి డీఎస్పీ ప్రతాప్‌తో మాట్లాడించారు. వైసీపీ హయాంలో తనపై బనాయించిన అక్రమ కేసుల గురించి డీఎస్పీకి ఆయన వివరించారు. తనపై అక్రమ కేసులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి తన అనుచరులతో కలిసి ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. పలు రకాల ఫైల్స్‌ను ఎస్పీ మురళీకృష్ణకు అందజేశారు. తనపై అక్రమ కేసులు బనాయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్దారెడ్డి అక్రమాలపై విచారణ జరిపి.. చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అక్కడి నుంచి లక్ష్మీనగర్‌లోని తన నివాసానికి చేరుకుని.. మీడియాతో మాట్లాడారు.

రాజకీయ కక్షతోనే..

వైసీపీ హయాంలో తమపై ఇష్టారాజ్యంగా అక్రమ కేసులు బనాయించారని ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. స్క్రాప్ వాహనాలు కొనుగోలు చేశానని సాకు చూపుతూ అప్పటి ప్రభుత్వ సలహాదారుడు సజ్జల, అప్పటి రవాణా మంత్రి పేర్నినాని, ఐపీఎస్ అధికారి సీతారామాంజినేయులు ఆదేశాలతో అప్పటి అనంత డీటీసీ శివరాంప్రసాద్ తనపైన, తన కుటుంబ సభ్యులపైన అక్రమ కేసులు బనాయించారని అన్నారు. తనపై అక్రమ కేసులు బనాయించిన వారిపై పక్షం రోజుల్లో కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, లేదంటే ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తానని హెచ్చరించారు.





వన్‌టౌన్‌లో డీఎస్పీ టీవీవీ ప్రతాప్‌కు ఫిర్యాదు చేస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి, నగరంలో జేసీ అనుచరులు

పెద్దారెడ్డిపై ఫైర్..

కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్ని వ్యాపారాలు చేస్తారని, కొడవళ్లపల్లి అమ్మవారి సొమ్మును పెద్దారెడ్డి దిగమింగితే అప్పట్లో కేసు నమోదైందని అన్నారు. ఈ డబ్బులు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. కర్ణాటక నుంచి అక్రమంగా డీజిల్‌ను తెప్పించి ఇక్కడ విక్రయించారని అన్నారు. కర్ణాటక మద్యాన్ని కూడా విక్రయించారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఇంట్లోని మహిళలు అక్రమ మద్యం విక్రయించారని ఆరోపించారు. ఇసుకను అక్రమంగా అమ్ముకున్నారని అన్నారు. సజ్జలదిన్నెలో 7.50 ఎకరాల ఇతరుల భూములను కొట్టేసేందుకు ప్రయత్నిస్తే తాను అడ్డుపడ్డానని అన్నారు. చిన్నపొలమడలో 78 ఎకరాల్లో వెంచర్ వేశారని అన్నారు. ఆర్టీసీ డ్రైవర్‌ను బెదిరించి.. వారి పొలాన్ని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. క్రైస్తవుల స్థలాన్ని కొట్టేసి చెన్నైకి వెళ్లి దొంగ సంతకాలు పెట్టించి, ఆయన భార్యపేరిట రాయించారని, ఆ తర్వాత ఆయన భార్య చెల్లెలి పేరిట మార్చారని ఆరోపించారు. ఆ స్థలంలో కట్టిన కాంప్లెక్స్‌లో మోర్ సూపర్ మార్కెట్ ఉందన్నారు. మున్సిపాలిటీ ఉద్యోగులకు ఇచ్చిన స్థలాన్ని బెదిరించి, బంధువు పేరుతో రాయించుకున్నారని, ఆ తర్వాత ఆయన భార్య పేరిట మార్చుకున్నారని ఆరోపించారు. ఆ స్థలంలో ఇల్లు కట్టించారని అన్నారు. పెద్దారెడ్డి ఇసుక దోపిడీపై హైకోర్టును ఆశ్రయించానని తెలిపారు. కోమటికుంట్లలో 480 ఎకరాలు కోడలు, కుమారుడి పేరిట రాయించారని, సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం ఆ పొలాలను బెదిరించి రాయించుకున్నారని ఆరోపించారు. తాడిపత్రిలో ఫ్యాక్టరీలు, లారీల వ్యవస్థను నాశనం చేశారని మండిపడ్డారు. పెద్దారెడ్డి ఏది చెబితే దాన్ని ప్రసారం చేస్తారా అని ఓ న్యూస్ చానల్, కొన్ని యూట్యూబ్ చానళ్లవారిని జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. తాను సాక్షాధారాలతోనే మాట్లాడుతున్నానని అన్నారు.

చిట్టీల పేరిట రూ.7 కోట్లకు టోపీ

అనంతపురం క్రైం: చిట్టీల పేరిట భారీగా డబ్బు వసూలు చేసిన విద్యుత్ శాఖ విశ్రాంత ఉద్యోగి.. జనానికి టోపీ పెట్టి ఉడాయించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేసే రామాంజినేయులు చిట్టీలు నిర్వహించేవాడు. ఆ శాఖ ఉద్యోగులు, ఇతర వ్యక్తులు అతని వద్ద చిట్టీలు వేశారు. ఈ క్రమంలో కొందరితో పెద్ద మొత్తంలో డబ్బు తీసుకున్నాడు. కొన్ని రోజులుగా డబ్బు వసూలు కావడంలేదని చెప్పుకొచ్చాడు. తాజాగా ఉద్యోగ విరమణ చేశాడు. ఆ తరువాత రూ.కోటికిపైగా విలువైన ఇంటిని అమ్మేసి.. అనంతపురం నుంచి అదృశ్యమయ్యాడు. బాధితులకు రూ.7 కోట్లకుపైగా చెల్లించాల్సి ఉందని సమాచారం. దీంతో ఆ శాఖ ఉద్యోగి నాగార్జున తదితరులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మొక్కలు నాటి.. సంరక్షించండి

కలెక్టర్ వినోద్‌కుమార్



మొక్క నాటుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం క్లాక్ టవర్, జూలై 24: జిల్లాలోని ఉద్యోగులందరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి.. వాటిని కంటికి రెప్పలా పరిరక్షించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. కలెక్టరేట్ ఆవరణలో హరిత అనంతలో భాగంగా బుధవారం మొక్కల నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఉద్యోగులతో మొక్కలు నాటించి, ప్రతి రోజూ వాటికి నీరు పోసి సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. మొక్కలను దత్తత తీసుకున్న ప్రతి ఒక్కరూ వాటికి నీరు పోసి, ఫొటోను ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో రామకృష్ణా రెడ్డి, ఏఓ అంజన్‌బాబు, ట్రెజరీ డీడీ సరళకుమార్, డీఎస్ఓ శోభారాణి, డీపీఎం ఆనంద్, ఎన్నికల సూపరింటెండెంట్ రవికుమార్, హార్టికల్చర్ ఏడీ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జలశక్తి అభియాన్‌కు సిద్ధం కండి

● నవంబరు నాటికి పనులు పూర్తవ్వాలి

● డ్వామా అధికారులకు కలెక్టర్ ఆదేశం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 24: జలశక్తి అభియాన్ పనులను నవంబరు నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని డ్వామా అధికారులను కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. డ్వామా కార్యాలయ సమావేశ మందిరంలో జలశక్తి అభియాన్, ఉపాధి పథకంపై బుధవారం జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జలశక్తి మిషన్‌ను మరింత వేగవంతం చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్, అనుబంధ శాఖలతో కలిసి డ్వామా అధికారులు సమన్వయంతో ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు.

ఇందుకు సంబంధించి జీఐఎస్ ట్యాగింగ్ పూర్తి చేయాలని సూచించారు. జలశక్తికి సంబంధించి ఏపీఓ, ఏపీడీ, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్స్‌తో ఒక బృందం ఏర్పాటు చేసి.. లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. ప్రతి సోమవారం పంపే నివేదికలో ఫిష్ పాండ్ వివరాలను జతపరచాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న అందరికీ స్థానికంగా ఉపాధి కల్పించాలని, జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి చేయాలని సూచించారు. జలశక్తి మిషన్ నిత్య పర్యవేక్షణకు ఏపీడీ స్థాయి అధికారిని నియమించాలని సూచించారు. అనంతరం జలశక్తి మిషన్ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. సమీక్షలో డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, ఏపీడీ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యపై సమీక్ష

జిల్లాలో అర్హులందరికీ మిషన్ వాత్సల్య పథకం అందేలా చూడాలని స్పాన్సర్‌షిప్ ప్రోగ్రాం కమిటీని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్ ప్రోగ్రాం కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పథకం ఆరు విభాగాలలో దరఖాస్తులను పరిశీలించి.. అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారని, డబ్ల్యూఓ అండ్ సీడబ్ల్యూఓ ఈఓ కన్వీనర్‌గా, చైల్డ్‌వెల్ఫేర్ చైర్‌పర్సన్ కో కన్వీనర్‌గా, రక్షణ అధికారి కార్యదర్శిగా ఉంటారని తెలిపారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి, ప్రత్యేక దత్తత ఏజెన్సీ ప్రతినిధి, ఆర్డీటీ సంస్థ ప్రతినిధి సభ్యులుగా ఉంటారని తెలిపారు. కమిటీ ద్వారా పథకం ప్రాధాన్యం, నియమ నిబంధనలు, దరఖాస్తు విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు.

రుచికరమైన సీటు!

ఐదేళ్లుగా వదలని అధికారి

- ఏసీబీలో ఉంటూ.. అక్రమ సంపాదన
- వసూళ్ల విధులకు ప్రత్యేక కానిస్టేబుల్
- గురుశిష్యుల అక్రమ ఆస్తులు రూ.కోట్లలోనే..
- ఇన్‌చార్జి డీఎస్పీ సీటు కోసం విశ్వప్రయత్నాలు



ఆ అధికారి పనిచేసేది అవినీతి నిరోధక శాఖలో..! కానీ కంచె చేను మేసినట్లు ఆయనే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఏసీబీలో ఏ అధికారైనా మూడేళ్లు మాత్రమే పనిచేయాలి. కానీ ఆయన ఐదేళ్లుగా అదే సీటులో కొనసాగుతున్నారు. గతంలోనూ నాలుగేళ్లపాటు పనిచేశారు. ఏసీబీ డీఎస్పీ బదిలీ అయిన సందర్భంలో దాదాపు రెండేళ్లపాటు ఇన్‌చార్జి డీఎస్పీగా ఉన్నారు. సీనియర్ సీఐని అంటూ వ్యవహారం నడిపారు. ఇప్పటికి అక్కడ పనిచేయబట్టి ఐదేళ్లయినా బదిలీ కాకుండా చక్రం తిప్పుతున్నారు. తాజాగా డీఎస్పీ బదిలీ కావడంతో మరోసారి ఇన్‌చార్జి కుర్చీ కోసం తహతహలాడుతున్నారు. సంపాదనబాగా మరిగినందుకే ఆయన 'అవినీతి' నిరోధక శాఖను వీడటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అవినీతి అధికారులపై బాధితులు ఫిర్యాదు చేస్తే.. ఈ సారు నేరుగా ఆ అధికారి లైన్‌లోకి వెళతారట. రూ.లక్షల్లో బేరమాడుతారట. ఏసీబీలో మొత్తం 13 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరిలో ఓ కానిస్టేబుల్‌ను తనకు నమ్మినబంటుగా మార్చుకున్నారు. వసూళ్ల వ్యవహారమంతా ఆ కానిస్టేబుల్ చూసుకుంటారని సమాచారం. సార్‌ను నమ్ముకున్నందుకు ఆ కానిస్టేబుల్ అనతికాలంలోనే కోటీశ్వరుడయ్యాడని ప్రచారం జరుగుతోంది. వైసీపీ హయాంలో ఏసీబీ కార్యాలయంలో ఆ అధికారిదే రాజ్యమని ఆ శాఖ సిబ్బందే అంటున్నారు. - అనంతపురం క్రైం

ఒక్కరినైనా పట్టుకున్నారా..?

ఆ అధికారి హయాంలో ఒక్క అవినీతి అధికారినీ పట్టుకున్నింది లేదు. స్వతహాగా దాడులు నిర్వహించిన దాఖలాలు లేవు. రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై దాడులు నిర్వహించిన సమయంలో.. జిల్లాలోనూ కొందరిని పట్టేశారు. అంతే..! ఉమ్మడి జిల్లాకు ఒకటే ఏసీబీ కార్యాలయం ఉండటం, అందులో ఆయనే సీనియర్ కావడంతో అడ్డు లేకుండా పోతోంది. భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కదిరి ప్రాంతానికి చెందిన ఓ రెవెన్యూ ఉద్యోగికి రూ.5 లక్షలకు అమ్ముడుపోయారనే తీవ్ర ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. ఆ ఉద్యోగిని అరెస్టు చేయకుండా ఏసీబీ అధికారులు తప్పించడమే దీనికి కారణమని కొందరు అంటున్నారు. ఓ ట్రాన్స్‌కో ఏఈపై లంచం అడుగుతున్నారని బాధితులు ఫిర్యాదు చేస్తే.. ఆ ఏఈతో బేరం మాట్లాడుకుని, రూ.5 లక్షలు వసూలు చేశారన్న ప్రచారం ఉంది. బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్‌పై గతంలో ఏసీబీ కేసు నమోదైంది. ఆ కేసు నుంచి తప్పిస్తామని నమ్మబలికి.. రూ.2 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. చివరికి ఆయన అదృశ్యమై చెన్నైలో ఆత్మహత్య చేసుకున్నారు.

భూములపై పెట్టుబడి..


అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ అధికారి.. వసూళ్లకు తనకు నమ్మకస్తుడైన కానిస్టేబుల్‌ను పంపుతుంటారని సమాచారం. అలా అక్రమంగా సంపాదించిన సొమ్మును భూములపై పెట్టుబడి పెడుతుంటారని, ఆస్తులను పోగేసుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే రూ.5 కోట్లకు పైగా వెచ్చించి రెండు అపార్ట్‌మెంట్లు, 20 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి, కడప నగరంలో రెండు ప్రాంతాల్లో విలువైన ఇళ్ల స్థలాలు బినామీ పేర్లతో కొనుగోలు చేశారని సమాచారం. తనపై అవినీతి ఆరోపణలు వస్తే.. ఉన్నతాధికారులను మేనేజ్ చేస్తారట. కేసులు ఎందుకు లేవని ఉన్నతాధికారులు అడిగితే... 'ఆఫీస్ నగరానికి దూరంగా ఉంది. అందుకే ఫిర్యాదు చేయడానికి ఎవరూ రావడం లేదు' అని చెబుతారట. గతంలో పనిచేసిన ఆ శాఖ ఉన్నతాధికారి, ప్రస్తుతం ఉన్న ఓ ఉన్నతాధికారి కాళ్లకు ఆయన సాష్టాంగ నమస్కారం చేశారట. ఏసీబీ డీఎస్పీ సుధాకర్‌రెడ్డిని ఇటీవల బదిలీ చేశారు. తిరుపతి డీఎస్పీ జెస్సీ ప్రశాంతికి అదనపు బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ఇప్పుడు కూడా ఇన్‌చార్జి (డీఎస్పీ) సీటు కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారట. ఇన్‌చార్జ్ అధికారితో సైతం 'మీరు రానవసరం లేదు లెండి మేడమ్.. నేనే చూసుకుంటా' అని చెబుతున్నారట.

ఆఫీస్‌లో వడ్డీ వ్యాపారం

ఆ సీఐ అండతో అక్రమ సంపాదన రుచిమరిగిన కానిస్టేబుల్.. ఏసీబీ కార్యాలయమే వేదికగా వడ్డీ వ్యాపారం చేస్తున్నారని సమాచారం. 'మా సార్ అండ ఉన్నంతవరకూ నన్ను ఎవరూ ఏమీ చేయలేరు..' అని ధీమాగా చెబుతారట. ఆఫీస్‌లో కూర్చుని.. ఎవరెవరు ఎంత వడ్డీ ఇవ్వాలో లెక్కలేసుకుంటూ ఉంటారని సమాచారం. వడ్డీలు కట్టనివారికి ఆఫీస్ నుంచి ఫోన్ చేసి బెదిరిస్తుంటారని ఆరోపణలు ఉన్నాయి. అక్రమ వసూళ్లతో ఎప్పుడో కోటీశ్వరుడైన ఆ కానిస్టేబుల్.. విధులను గాలికి వదిలేశారని అంటున్నారు. ఇప్పటికే అనంతపురం నగరంలోని గుత్తి రోడ్డులో రూ.కోటి విలువైన ఇంటిని కట్టించాడట. తాజాగా రూ.80 లక్షలు వెచ్చించి స్థలం కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

వసూళ్ల కింగ్!

జూన్ వస్తే ఆయనకు పండగే



- స్కూళ్లకు ఏడాదికి టార్గెట్లు ఫిక్స్
- రీ ఓపెన్ కాగానే ముట్టజెప్పాల్సిందే
- కోట్లకు పడగలెత్తిన అధికారి
- పదేళ్లుగా జిల్లా కేంద్రంలోనే తిష్ట
- జిల్లా విద్యాశాఖలో అవినీతి జలగ

అనంతపురం విద్య, జూలై 24: పదేళ్లకు పైగా ఒకే పోస్టులో ఉన్న ఓ అక్రమార్కుడు వసూళ్లలో కింగ్‌లా అవతరించాడు. పెట్టుబడి లేని దందాతో కోట్లకు పడగలెత్తాడు. కొందరు మున్సిపల్ టీచర్లను ప్రైవేట్ సైన్యంలా ఏర్పాటు చేసుకుని వసూళ్లకు పాల్పడుతున్నాడు. విద్యా సంవత్సరం ఆరంభం అయిందంటే ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్ల కంటే ఈయనకే ఎక్కువ ఆనందం. అప్పనంగా లక్షల రూపాయలు జేబులో చేరుతుండటమే ఇందుకు కారణం. ప్రతి ఏటా జూన్ మాసం వచ్చిందంటే ఆయనకు వసూళ్ల పండుగే. టార్గెట్లు పెట్టి మరీ వసూళ్లకు పాల్పడుతుంటాడు. అయితే ఆయనపై ఇప్పటి వరకూ ఏసీబీ అధికారులు కానీ, ఇటు విద్యాశాఖ అధికారులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఏటా ముట్టజెప్పాల్సిందే..

ఆయన.. మండల విద్యాశాఖలో పనిచేసే అధికారుల్లో ఒకరు. జిల్లా కేంద్రమైన అనంతపురంలో సుమారు 10 ఏళ్లకు పైగా పనిచేస్తున్నారు. ప్రతి ఏటా జూన్ 12 తర్వాత స్కూళ్లలో అడ్మిషన్లు మొదలవగానే ఆయన దందా ప్రారంభిస్తాడు. అనంతపురంలో ఉండే ప్రైమరీ, ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లే లక్ష్యంగా వసూళ్లు చేస్తారు. అడ్మిషన్ల కాలం రాగానే...ప్రతి స్కూల్ రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకూ ఆయనకు ముట్టజెప్పాల్సిందే. చాలా స్కూళ్లలో భవనాలు, ఆట స్థలాలు, మరుగుదొడ్లు, అదనపు సెక్షన్లు, టెక్ట్స్ బుక్స్, యూనిఫాం అమ్మకాలు, ఇలా ఏదో ఒక అంశంలో లోపాలుంటాయి. ఆ లోపాలే ఆయనకు కాసులు కురిపిస్తాయి. జూన్ నెలలో అడ్మిషన్లు ప్రారంభం కాగానే...ఆయనే నేరుగా స్కూళ్లలో వాలిపోతాడు. ఆ అధికారి రాగానే స్కూల్ కరస్పాండెంట్లు కిమ్మనకుండా ఆయనకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేలు చేతిలో పెట్టాలి. కొత్త స్కూళ్లు, లేదా కార్పొరేట్ స్కూళ్లు అయితే మరింత ఎక్కువ చదివించుకోవాలి. ఇది ప్రతి ఏటా నడిచే వసూళ్ల దందానట. ఈ లెక్కన ఈ ఆయన ప్రతి ఏటా లక్షలాది రూపాయలు వసూళ్లు చేసి రూ.కోట్లు వెనకేసుకొస్తున్నట్లు విమర్శలు భారీగా వినిపిస్తున్నాయి.

కోట్లకు పడగలెత్తి...

జిల్లా కేంద్రంలో విద్యాశాఖాధికారిగా పాతుకుపోయిన ఆయన ఈ పదేళ్లలో కోట్లకు పడగలెత్తాడు. గతంలో ఈ అధికారి ఓ లాడ్జిలో పేకాట ఆడుతూ పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. ఒకప్పుడు వ్యసనాలతో అప్పుల్లో కూరుకుపోయిన ఆయన వసూళ్ల దందాతో నేడు కరోడ్‌పతిగా ఎదిగాడు. ప్రతి ఏటా వచ్చే వసూళ్లతో నగరంలో సుమారు రూ. 70 లక్షల నుంచి కోటి రూపాయల విలువైన ఇల్లు కూడా నిర్మించారట. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో కరస్పాండెంట్ల నుంచే కాకుండా మున్సిపల్ స్కూళ్లలో బాగానే కథ నడుపుతున్నారు. టీచర్ల సర్దుబాటు, మిడ్ డే మీల్స్‌లో ఏజెన్సీ నిర్వాహకుల నుంచి కూడా బాగానే లాగేస్తున్నారు. ఈ వ్యవహారాల్లో కొందరు మున్సిపల్ స్కూళ్ల టీచర్లను సైతం తన సైన్యంగా మార్చుకున్నారు. మొత్తంగా కోట్లకు పడగలెత్తిన ఆ అధికారిపై గతంలో జిల్లాకు వచ్చిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కూడా ఘాటుగానే హెచ్చరించారు. అయితే వైసీపీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో చెప్పించుకుని బయటపడినట్టు సమాచారం. ఇప్పుడు మళ్లీ టీడీపీ నేతలను కాక పట్టే పనిలో పడ్డాడు. ఏ ఎండకు ఆ గొడుగు పడుతూ...కోట్లకు పడగలెత్తిన ఆ అధికారి అక్రమాలకు అంతేలేకుండా పోతోంది. జిల్లా కేంద్రంలో వసూళ్ల దందాకు పాల్పడుతున్న ఈయన ఇక్కడే ఉండే ఏసీబీ అధికారుల దృష్టికి కనిపించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

విధుల్లో నిర్లక్ష్యంపై వేటు

- కణేకల్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సస్పెన్షన్
- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్జేడీ శామ్యూల్
- వరుస కథనాలు ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి'



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏడీ నాగరాజు



ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఆర్జేడీ ఇచ్చిన ఉత్తర్వుల కాపీ

అనంతపురం విద్య, జూలై 24: విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తూ, స్కూల్‌కు రాకుండా అజ్ఞాతంలో ఉన్న కణేకల్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ఆదినారాయణప్పను అధికారులు సస్పెండ్ చేశారు. ఈ మేరకు కడప పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ శామ్యూల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మోడల్ స్కూల్‌లో ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా, సివిక్స్ పీజీటీగా పనిచేస్తున్న బీసీ ఆదినారాయణప్ప కొంతకాలంగా స్కూల్‌కు రావడం లేదు. స్కూల్‌లో సాగుతున్న తంతుపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నెల 11న 'పెద్దసారు యాడున్నాడో..? అడ్రెస్ లేని ప్రిన్సిపాల్, ఈనెల 24న 'పట్టించుకునేదెవరు..?' శీర్షికన కథనాలు ప్రచురితం అయ్యాయి. అయినా జిల్లా విద్యాశాఖాధికారుల్లో చలనం కనిపించలేదు. అయితే ఈ ఘటనపై ఆర్జేడీ శామ్యూల్ జిల్లా విద్యాశాఖాధికారులపై మండిపడ్డారు. వెంటనే ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. స్కూల్‌లో బోటనీ పీజీటీగా పనిచేస్తున్న బసవరాజుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఎట్టకేలకు స్కూల్‌కు వెళ్లిన ఏడీ

కణేకల్లు: జిల్లా విద్యాశాఖలో మోడల్ స్కూళ్లను పర్యవేక్షించే ఏడీ నాగరాజు ఇన్నాళ్లు అటు వైపు చూడలేదు. ఎట్టకేలకు బుధవారం ఆయన కణేకల్లు స్కూల్‌కు పరుగులు తీశారు. సుమారు రెండు నెలలుగా ప్రిన్సిపాల్ స్కూల్ విధులకు గైర్హాజరు అవుతున్నా మోడల్ స్కూల్ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంపై అనేక అనుమానాలు వస్తున్నాయి. 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు రావడంతోపాటు, ఆర్జేడీ ఆగ్రహంతో ఏడీలో చలనం వచ్చినట్టు ఉంది. ఎట్టకేలకు మధ్యాహ్నం మోడల్ స్కూల్‌కు వెళ్లి ఆయన విచారణ చేశారు. స్కూల్‌లో సిబ్బందిని ఆరా తియ్యడంతో పాటు, మధ్యాహ్నభోజనాన్ని ఏడీ నాగరాజు పరిశీలించారు.

నేడు ఆర్జేడీ శామ్యూల్ రాక

అనంతపురం విద్య, జూలై 24: పాఠశాల విద్యాశాఖ కడప ఆర్జేడీ శామ్యూల్ గురువారం జిల్లాకు రానున్నారు. జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు -1, 2లతో పాటు, కేజీబీవీ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించనున్నారు. పంగల్ రోడ్డులోని ఆర్డీటీ ఆడిటోరియంలో మధ్యాహ్నం 2 గంటలపైన సమావేశం నిర్వహించనున్నారు. తొలిసారి ఆర్జేడీగా ఆయన జిల్లాకు రానున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల వేళ డీఈఓగా ఉన్న శామ్యూల్ వైసీపీ నాయకుల అక్రమాలపై అప్పట్లో గట్టిగానే ఉన్నారు. దీంతో ఆయనపై కక్షగట్టి అప్పటి వైసీపీ నాయకులు ఆయనను ఇక్కడి నుంచి పంపించేశారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి పార్టీలు అధికారంలోకి రావడంతో కర్నూలు జిల్లా డీఈఓగా ఉన్న శామ్యూల్‌ను కడప ఆర్జేడీగా నియమించింది. ఆర్జేడీ అయిన తర్వాత తొలిసారి అనంతపురం జిల్లాకు రానుండటం గమనార్హం.

ఆన్‌లైన్‌లో సులభంగా ఆదాయ పన్ను చెల్లింపు

అవగాహన సదస్సులో ఐటీఓ విజయలక్ష్మి



కేక్‌ను కట్‌చేసి వేడుకలను ప్రారంభిస్తున్న ఐటీఓ విజయలక్ష్మి

అనంతపురం సెంట్రల్, జూలై 24: ఆన్‌లైన్‌లోనే ఆదాయ పన్నును సులభంగా చెల్లించవచ్చని ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్(ఐటీఓ) విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆదాయపన్ను 165వ వార్షికోత్సవాన్ని బుధవారం ఆ శాఖ కార్యాలయంలో ఐటీఓ విజయలక్ష్మి కేక్‌కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం పన్ను చెల్లింపు దారులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో విజయలక్ష్మి మాట్లాడుతూ అసెస్మెంట్ ఇయర్ 2024-25 రిటన్స్ ఫైల్‌ను ఈ నెల 31లోపు ప్రభుత్వ వేతన ఉద్యోగులు సబ్‌మిట్ చేయాలని సూచించారు. సెక్షన్ 80సీ కింద ఆధారాలు సమర్పించగలిగే ఎలిజిబిలిటి డిడక్షన్‌ను మాత్రమే క్లైమ్ చేయాలన్నారు. తప్పుడు రిటన్స్ ఫైల్ చేయకుండా కరెక్ట్ అండ్ ట్రూ ఇన్‌కమ్ ట్యాక్స్ రిటన్స్ ఫైల్ చేయాలని కోరారు. రాంగ్ డిడక్షన్ చేసేవారికి సెక్షన్ 270ఏ కింద జరిమానా విధిస్తారన్నారు. అంతకుముందు కార్యాలయ ఆవరణంలో శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆదాయ పన్నుశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోండి

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ



రాయదుర్గంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

రాయదుర్గం, జూలై 24: వర్షాభావంతో ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేరుశనగ సాగుచేయలేదని, ప్రత్యామ్నాయంగా ఆముదం, జొన్న, సజ్జ, రాగి, కొర్ర, పెసలు లాంటి పంటలు సాగు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అధికారులు సిబ్బందితో బుధవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఏ పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు? సీసీఆర్సీ కార్డ్స్ రెన్యువల్ గురించి, సీజన్‌లో రైతులకు ఇవ్వాల్సిన సూచనలు, పీఎం కిసాన్‌కు సంబంధించిన సమస్యలు, పొలంబడి తదితర విషయాలపై సిబ్బందితో వివరాలు సేకరించారు. జిల్లాలో వేరుశనగతో పాటు అన్ని పంటలు కలిపి దాదాపుగా 3,46,733 హెక్టార్లలో పంటలు సాగు చేయవలసి ఉండగా 83,839 హెక్టార్లలో మాత్రమే రైతులు పంటలు సాగు చేశారన్నారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మానాయక్, ఆయా మండలాల ఏఓలు నిర్మల్‌కుమార్, కృష్ణ, కిషోర్‌రెడ్డి, సాయికుమార్, ఏఈఓ ఆంజనేయులు, ఆర్‌బీకే సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపుకార్డుల పంపిణీకి చర్యలు

కణేకల్లు: జిల్లాలోని కౌలురైతులకు గుర్తింపుకార్డుల పంపిణీకి చర్యలు తీసుకుంటు న్నట్లు వ్యవసాయశాఖ జేడీఏ ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కణేకల్లు, బొమ్మనహాళ్ ఎంపీఈఓలతో ఆమె సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ మట్టినమూనా పరీక్షలను సత్వరమే పూర్తి చేయాలని ప్రతి ఆర్‌బీకే కేంద్రం వద్ద హరిత అనంత కార్యక్రమం కింద నాలుగు మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం స్థానిక వ్యవసాయ విత్తనోత్పత్తి క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ ఖరీఫ్‌సీజన్‌కు విత్తనోత్పత్తి క్షేత్రంలోని హెచ్‌ఎన్ఎం ఫారంలో బీపీటీ 5204 రకానికి చెందిన వరి నారును సిద్ధం చేస్తున్నామని 65 ఎకరాలలో సాగు చేస్తామన్నారు. మరో ఏడు ఎకరాల్లో బీపీటీ 2846 రకాన్ని సాగు చేయబోతున్నట్లు అధికారులు తెలిపారు. పీడీడీ ఫారంలో 67.5 ఎకరాలలో బీపీటీ 5204 రకంను సాగు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫారం ఏడీఏ నారాయణనాయక్, రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, బొమ్మనహాళ్ ఏఓ సాయికుమార్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డివిజన్‌కు అభివృద్ధి నిధులు వస్తాయి

- డీఆర్ఎం విజయకుమార్



జీఎం సందేశ కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్ఎం, ఏడీఆర్ఎం

గుంతకల్లు, జూలై 24: ప్రతి సంవత్సరంలాగే ఈ బడ్జెట్ లోనూ గుంతకల్లు రైల్వే డివిజన్‌కు పెద్ద మొత్తంలో నిధులు వస్తాయని డీఆర్ఎం విజయకుమార్ ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. బుధవారం మధ్యాహ్నం ప్రసారమైన జీఎం సందేశ కార్యక్రమానికి డీఆర్ఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ డివిజన్‌లో ఇప్పటికి 73 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధులు వచ్చాయన్నారు. అభివృద్ధి కార్యక్రమం నడుస్తోందని, ఈదఫా కూడా డివిజన్‌లోని రైల్వే స్టేషన్లు, ప్రాజెక్టులు, బైపాస్ లైన్లకు తప్పక నిధులు మంజూరౌతాయని తెలియజేశారు. త్వరలో పింక్ బుక్ విడుదల అవుతుందని, డివిజన్‌కు ఎన్ని నిధులు వచ్చాయో బహిర్గతమౌతుందన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రెండు రైళ్ల రద్దు

హైదరాబాద్ రైల్వే డివిజన్‌లో జరుగుతున్న లైన్ పనుల కారణంగా గుంతకల్లుకు చెందిన రెండు రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు-బోధన్ రైలు (నెం. 07671), కాచిగూడ-గుంతకల్లు రైలు (నెం. 07670)ను ఆగస్టు నెల పూర్తిగా రద్దుచేసినట్లు తెలియజేశారు.

యాద్గిర్‌లో వందేభారత్ రైలుకు స్టాపింగ్

అనంతపురం-గుంతకల్లు మీదుగా వెళ్లే ఓ రైలుకు యాద్గిర్ రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు తెలియజేశారు. బెంగళూరు-కలబురగి (నెం. 22232) వందేభారత్ రైలుకు ఈ నెల 27 నుంచి, దాని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 22231)కు ఈ నెల 28 నుంచి ఒక నిమిషం సేపు యాద్గిర్‌లో నిలపనున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ 'తల్లికి వందనం' భేష్

- ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం విద్య, జూలై 24: అర్హులందరికీ తల్లివందనం కింద లబ్ధి చేకూరుస్తామని విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పష్టీకరించడం అభినందనీయమని అనంతపురం జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ (ఏపీపీఎస్ఏ) నాయకులు పేర్కొన్నారు. కమలానగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ శాసన మండలిలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ తల్లికి వందనం ఎంతమంది అర్హులుంటే అంత మందికీ ఇస్తామని చెప్పడం ఆనందంగా ఉందన్నారు. పైగా ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులకు వర్తింపజేస్తామని మంత్రి పేర్కొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా వ్యవస్థాపకులు, సీఆర్వో రవిచంద్రారెడ్డి, గౌరవ సలహాదారులు రామాంజినేయులు, జిల్లా గౌరవ అధ్యక్షులు గంగాధర్ యాదవ్, జిల్లా గోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి రమణారెడ్డి, కోశాధికారి రామచంద్ర, ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, నగర గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, నగర అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, నగర కోశాధికారి వేణు మనోహర్, ఇతర నాయకులు జానకిరాములు, విజయ్‌కుమార్, రఫీ, సోమశేఖర్, వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రీవత్స, మద్దయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జూలై 24: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంటెక్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, ఈసీ చంద్ర మోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. మే, జూన్‌లో నాలుగో సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సెమిస్టర్ పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరీక్షల ఫలితాల కోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని వారు సూచించారు.

టీచర్ల పీఎఫ్ ఖాతాలు అప్‌డేట్ చేయాలి

- జడ్పీ సీఈఓకు ఏపీటీఎఫ్ వినతి



జడ్పీ సీఈఓకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జూలై 24: ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాలను వెంటనే అప్‌డేట్ చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రావును బుధవారం ఆ సంఘం నాయకులు జడ్పీలో కలిశారు. సంఘం రాష్ట్రకార్యదర్శి నరసింహులు, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్ మాట్లాడుతూ పీఎఫ్ ఖాతాలు నేటికీ నవీకరించలేదన్నారు. ఎవరి ఖాతాలో ఎంత నగదు జమ అయ్యిందో...? నెలవారీగా జమలు, వడ్డీ జమల వివరాలు తెలియకుండా ఉండటం వల్ల పీఎఫ్ ఖాతాలపై ఉపాధ్యాయుల్లో ఆందోళన ఉందన్నారు. వేలాది మంది టీచర్ల పార్ట్ ఫైనల్ రుణాలు, ఇతర రుణాల కోసం నెలల తరబడి జడ్పీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా...సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. అన్ని జిల్లాల్లో వార్షిక ఖాతాలు నిల్వల వివరాలు విడుదల చేసినా...అనంతపురం జిల్లాలో నేటికీ విడుదల చేయకుండా ఖాతాలను స్తంభించజేశారంటూ అసహనం వ్యక్తం చేశారు. అనారోగ్యం, పిల్లల చదువులు, ఇతర సమస్యల పరిష్కారానికి పీఎఫ్ రుణాలు ఆసరాగా ఉంటాయని టీచర్లు భావిస్తున్నారన్నారు. పీఎఫ్ ఖాతాలను వెంటనే అప్‌డేట్ చేయాలన్నారు. ఈ మేరకు సీఈఓకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు సతీష్‌కుమార్, సభ్యులు సర్దార్‌వలి, పాతిరెడ్డి, కిష్టప్ప, రామాంజనేయులు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాలాన్ని మేల్కొలిపిన కవి జాషువా

వర్ధంతి సభలో మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్




సాహితీ సదస్సులో మాట్లాడుతున్న శైలజానాథ్

అనంతపురం కల్చరల్, జూలై 24: కాలాన్ని మేల్కొల్పిన కవి గుర్రం జాషువా అని, ఆయన రచనలతో సమాజంలో చైతన్యం తీసుకొచ్చారని మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. గుర్రం జాషువా 53వ వర్ధంతి సందర్భంగా బుధవారం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల కామర్స్ సెమినార్ హాల్‌లో ఎస్కేయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన సాహితీ సదస్సుకు శైలజానాథ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సాహిత్యం నేటి యువతరానికి ఎంతో అవసరమని, జాషువా సాహిత్యం విశ్వజనీనమైనదని పేర్కొన్నారు. జాషువా సాహిత్యం పండితులకు, పామరులకు సరళంగా అర్థమయ్యేలా ఉంటుందని కొనియాడారు. జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య మాట్లాడుతూ జాషువా సాహిత్యాన్ని విద్యార్థి లోకానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. జనప్రియకవి ఏలూరు యంగన్న మాట్లాడుతూ వర్ణ సమాజం, వర్గ సమాజం పోవాలని సాహిత్యాన్ని సృష్టించిన మహాకవి జాషువా అన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ గబ్బిలం, కాందిశీకుడు, బాపూజీ, నేతాజీ, ముంతాజ్ మహల్, ఫిరదౌసి వంటి కావ్యాలతో జాషువా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, ఎల్‌కేపీ అధ్యక్షుడు గాజుల వెంకటసుబ్బయ్య, ఎస్కేయూ తెలుగుశాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర, అంకె రామలింగయ్య, పూజారి ఈరన్న, గంగిరెడ్డి అశ్వత్థరెడ్డి, ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తొణికిసలాడుతున్న టీబీ డ్యాం

- 99 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ
- పది గేట్లు ఎత్తి నీటి విడుదల



క్రస్ట్ గేట్ల నుంచి విడుదల అవుతున్న వరద జలాలు

బొమ్మనహాళ్, జూలై 24: తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతుండటంతో టీబీ బోర్డు అధికారులు బుధవారం 10 క్రస్ట్ గేట్లు ఒక్క అడుగు మేర ఎత్తి 18,746 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. వాటితో పాటు కాలువలకు 7205 క్యూసెక్కులను వదులుతున్నారు. 1633 అడుగులతో 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో బుధవారం సాయంత్రానికి 1631.34 అడుగులతో 99.195 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 84, 115 క్యూసెక్కులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. డ్యాంకు ఆశించిన స్థాయి కన్నా ఎక్కువగా నీరు చేరుతోంది. గరిష్ఠ స్థాయిలో నీటి నిల్వ ఉండటంతో హెచ్చెల్సీ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హెచ్చెల్సీ బొమ్మనహాళ్ సరిహద్దు 105వ కి.మీ. వద్ద 500 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 24: ప్రభుత్వ వైద్యకళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఖాళీగా ఉన్న పారామెడికల్ కోర్సులకు ఆగస్టు 6లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు తెలిపారు. డీఎంఎల్‌డీ 10సీట్లు, డీఓఏ 10, డీఏఎన్ఎస్ 30, డీఎంఐటీ 10, డీఈసీజి 3, డీఆర్‌జీఏ 3, డీడీఆర్ఏ 3 మొత్తం 69సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్‌లో బైపీసీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు.

టమోటా కిలో రూ.40

అనంతపురం రూరల్, జూలై 24: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.53తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం 1350టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.30, కనిష్ఠ ధర రూ.15 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, జూలై 24: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17,500, కనిష్ఠంగా రూ.2,500, సరాసరి రూ.12వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1185టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్ట చతుర్థి పూజలు


అలంకరణలో గణనాథుడు

అనంతపురం కల్చరల్, జూలై 24 : ఆషాఢమాస చవితిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం నగరంలోని పలు ఆలయాల్లో సంకష్ట చతుర్థి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నేపథ్యంలో మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో గణనాథుడి మూలవిరాట్‌కు ఫలపంచామృతాభిషేకాలు చేశారు. స్వామివారికి గరిక పూజ చేసి, కుడుములను నివేదించా ఆలయ ఈఓ రమేష్‌బాబు, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, కిశోర్, హర్ష, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి కుటుంబ సభ్యులు

అనంతపురం అర్బన్, జూలై 24: గన్నవరం నియోజకవర్గం ఉంగుటూరు మండలం తెల్లప్రోలు గ్రామంలో వెలసిన రంగమ్మ పేరంటాలు అమ్మవారిని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఆయన సతీమణి శ్రీలక్ష్మి, కుమార్తె అశ్రిత బుధవారం రాత్రి దర్శించుకున్నారు. అమ్మవారికి ఎమ్మెల్యే దంపతులు సారె అందించి మొక్కులు చెల్లించినట్లు టీడీపీ స్థానిక నాయకులు తెలిపారు.

రేపు పీవీకేకే ఐటీలో ప్రాంగణ నియామకాలు

అనంతపురంరూరల్, జూలై24: స్థానిక పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. [24]7.ai సంస్థలోని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ ఉద్యోగాలకు నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. 2023-24లో ఏదైనా డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు శుక్రవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్‌లు, రెజ్యూమ్‌తో కళాశాలలో హాజరుకావాలన్నారు.

31న మాన్యం భూముల కౌలు వేలం

అనంతపురం కల్చరల్, జూలై 24: మండలపరిధిలోని ఉప్పరపల్లిలో ఉన్న చంద్రశేఖర స్వామి, ఆంజనేయస్వామి ఆలయాల మాన్యం భూముల కౌలు కోసం ఈనెల 31న జిల్లాకేంద్రం లోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయ కల్యాణమండపంలో వేలం నిర్వహిస్తున్నట్లు దేవదాయశాఖ ఈఓ రామాంజనేయులు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. వేలంలో పాల్గొన దలచినవారు 31న ఉదయం 9.30 గంటలకు చేరుకుని ముందుగా రూ.2వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. అదేవిధంగా ఇటుకలపల్లిలోని చెన్నకేశవస్వామి ఆలయ మాన్యం భూములను కౌలుకు ఇచ్చేందుకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగలవారు వేలంలో పాల్గొనాలని తెలిపారు.

ఘనంగా అయ్యంకి జయంతి

అనంతపురం విద్య, జూలై 24: గ్రంథాయల ఉద్యమకారుడు అయ్యంకి వెంకట రమణయ్య 134వ జయంతిని బుధవారం జిల్లా కేంద్రగ్రంథాలయ సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కార్యదర్శి రమ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంతియాజ్ అహ్మద్, రామాంజినమ్మ, భాషాకిరణ్, మల్లి, కావేరి, శ్రీజయ, శిష, నాగమణి, ముత్యాలమ్మ, ఇందిర, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్(కనగానపల్లి): గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి జయంతిని బుధవారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించారు. గ్రంథాలయాధికారి గోవిందు స్థానికులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవల ను ప్రజలకు వివరించారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

అంతరాయంలేని విద్యుత్ అందించాలి

విద్యుత్ శాఖ ఎస్‌ఈని కోరిన ఎమ్మార్పీఎస్ నాయకులు


ఎస్‌ఈ సంపత్‌కుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, జూలై 24: వ్యవసాయ ఆధారితమైన జిల్లాలో వ్యవసాయానికి అంతరాయం లేని విద్యుత్ సేవలు అందించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు విద్యుత్ శాఖ ఎస్‌ఈ సంపత్ కుమార్‌ను కోరారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఈ సంపత్ కుమార్‌ను బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ప్రజాసంఘాల రాష్ట్ర జేఏసీ చైర్మన్ రవిరాజ్ మాట్లాడుతూ నిర్ణయాత్మకమైనా ఆదేశాలు జారీచేసే ఉన్నతాధికారులుగా దళితులను నియమించడం ఎన్‌డీఏ ప్రభుత్వ ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్నపెద్దన్న, ఆనంద్, ఓబులేసు, కుళ్లాయిస్వామి, నాగేంద్ర, రామకృష్ణ, సత్యమయ్య పాల్గొన్నారు.

చైతన్య జ్వాల జాషువా

అనంతపురం సెంట్రల్, జూలై 24: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా సమాజాన్ని మేల్కొపిన చైతన్య జ్వాల అని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. జాషువా వర్థంతిని పురష్కరించుకుని బుధశారం ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. నాయకులు రామకృష్ణ, రేకలకుంట రామాంజినేయులు, నాగరాజు, హరిబాబు, గోవిందు, నగేష్ తదితరులు పాల్గొన్నారు. ఆదేవిధంగా సమతా సైనిక్ జిల్లా అధ్యక్షుడు సుగమంచి శ్రీనివాసులు అధ్వర్యంలో ఐక్యవేదిక గంగాధరప్ప, ఉరుముల కళాకారులు రాము, నాగరాజు, మాలమహానాడు సురేష్ జాషువాకు నివాళులర్పించారు.

పట్టాలు దాటుతుండగా కదిలిన రైలు

పడుకుని ప్రాణాలు దక్కించుకున్న మహిళ

గార్లదిన్నె, జూలై 24 : మండలపరిధిలోని కల్లూరు రేల్వే స్టేషన్‌లో రైలు నిలబడి ఉండగా దానికింద నుంచి దాటుతున్న మహిళకు త్రుటిలో ప్రమాదం తప్పింది. కల్లూరు కొండకింద మారుతి నగర్‌లో నివాసముంటున్న నల్లమ్మ అనే మహిళ టైలరింగ్ చేస్తూ కు టుంబాన్ని పోషించుకుంటోంది. ఆమె బుధవారం ఉదయం పని ని మిత్తం మారుతి నగర్ నుంచి కల్లూరులోకి వెళుతోంది. ఆ సమయంలో రైలు నిలబడి ఉండడంతో రైలు కింద నుంచి ఆమె దాటుతుండగా రైలు ఒక్కసారిగా కదిలింది. దీంతో తీవ్ర భయందోళనకు గురైన నల్లమ్మ చాకచక్యంగా రైలుకింద పడుకుంది. ప్రమాదంలో చెయ్యి వేళ్ళు కట్ అయ్యాయి. ఆమెను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

టీడీపీ నేతల వాగ్వాదం

బుక్కరాయసముద్రం, జూలై24: మండలంలో స్టోర్ డీలర్ల విషయంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం టీడీపీ నాయకులు వాగ్వాదం చేసుకున్నారు. అనంతపురం సీఐ వెంకటేశ్వర్లు, రెండు వర్గాల నాయకులను స్టేషన్‌కు పిలిపించి మట్లాడారు. సమస్య లేకుండా శాతియుంతంగా ఉండాలని సూచించారు. ఘర్షణలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈవీఎంల గోడౌన్లను పరిశీలించిన కలెక్టర్


గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 24: నగరంలోని టవర్‌క్లాక్ సమీపంలో ఉన్న పాత ఆర్డీఓ కార్యాలయం ఆవరణంలో ఉన్న ఈవీఎంల గోడౌన్‌తో పాటు జేఎన్‌టీయూలోని ఈవీఎం గోడౌన్లను బుధవారం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను కలెక్టర్ పరిశీలించారు. నాయకుల సమక్షంలో గోడౌన్లలో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు, భద్రతా చర్యలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, డీటీ దివాకర్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పురాతన కట్టడాలను పరిరక్షించాలి : కలెక్టర్

అనంతపురం రూరల్/కల్చరల్: పురాతన కట్టడాలను పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ బుధవారం నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయం భవనాన్ని, జిల్లా జైలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పురాతమైన పాత ఆర్డీఓ కార్యాలయాన్ని, జిల్లా జైలును అభివృద్ధి చేసి, టూరిజం ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పురాతనమైన భవనాలను కాపాడుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈకార్యక్రమంలో అనంతపురం తహసీల్దార్ శివరామిరెడ్డి, సర్వేయర్ ప్రతాప్‌రెడ్డి, ఆర్‌ఐ సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి ఢిల్లీ షో అట్టర్ ఫ్లాప్

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, జూలై 24 : మాజీ సీఎం జగన్‌రెడ్డి ఢిల్లీ షో అట్టర్ ఫ్లాప్ అయ్యిందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్రం నుంచి ఏ విధంగా నిధులు తెచ్చుకోవాలని ఆలోచిస్తుంటే... ప్రతిపక్ష హోదా కోల్పోయిన జగన్ రాష్ట్రంలో దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు వస్తాయని ముందుగా గ్రహించి, సీఎం చంద్రబాబుకు మంచి పేరు వస్తుందనే ఇలా నాటకాలు ఆడుతున్నా రన్నారు. గత ప్రభుత్వంలో ఏం జరిగిందో అందరికీ తెలుసునన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుకు శాసన సభ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. భూమాఫియాకు టీడీపీ చెక్ పెట్టిందన్నారు.

చంద్రబాబు కృషితోనే కేంద్రం నిధులు

టీడీపీ కుమ్మర, శాలివాహన సమితి రాష్ట్ర కన్వీనర్

అనంతపురం అర్బన్ జూలై 24: సీఎం చంద్రబాబు కృషితోనే కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి నిధులు కేటాయించారని టీడీపీ కుమ్మర, శాలివాహన సమితి రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ఇచ్చిన విజయాన్ని సొంత ప్రయోజనాల కోసం కాకుండా రాష్ట్రం కోసం చంద్రబాబు ఉపయోగిస్తున్నారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించడం శుభపరిణామమన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు అపూర్వ విజయం అందించినందుకు ఫలితం దక్కిందన్నారు.

రాష్ట్ర పునర్నిర్మాణమే చంద్రబాబు ధ్యేయం


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీశ్రేణులు

చెన్నేకొత్తపల్లి, జూలై 24: రాష్ట్రాభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని, అందుకోసం శక్తివంచన లేకుండా శ్రమిస్తున్నారని టీడీపీ మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి, తెలుగుమహిళ శ్రీసత్యసాయి జిల్లా ప్రధానకార్యదర్శి రామసుబ్బమ్మ పేర్కొన్నారు. కేంద్రబడ్జెట్లో ఏపీకి అధిక నిధులు కేటాయించడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ స్థానిక కార్యాలయ ఆవరణంలో తెలుగుమహిళల ఆధ్వర్యంలో బుధవారం సీఎం చంద్రబాబు చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. టీడీపీ నాయకులు అంకే అమరేంద్ర, వడ్డేదుర్గ, ఏపీ శ్రీనివాసులు, రమణారెడ్డి, వెంకళరెడ్డి,షరీఫ్, కానాశివారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీధర్, తెలుగు మహిళలు విజయలక్ష్మి, లక్ష్మీనరసమ్మ, అస్మత్‌బీ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందించాలి: ఎస్‌ఎఫ్‌ఐ

శింగనమల, జూలై24: ప్రభుత్వ జూనియర్‌కళాశాలల్లో వెంటనే మధ్యాహ్నం భోజనం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తరిమెల గిరి, సహాయకార్యదర్శిరాచేపల్లి సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. శింగనమలలో బుధవారం ఎస్ఎఫ్ఐ మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... పట్టణం, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే నిరుపేద విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. కావున ప్రతి కళాశాలలో మధ్యాహ్న భోజనం అందజేయాలన్నారు. శింగనమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

జలధికి తరలిన పీర్లు


పీర్లను జలధికి తీసుకెళ్తున్న గ్రామస్థులు

రామగిరి, జూలై 24: మండల కేంద్రమైన రామగిరిలో బధవారం పీర్లను జలధికి తీసుకెళ్లారు. మొహరం సందర్భంగా గ్రామస్థులు మంగళవారం రాత్రి పానకాలు సమర్పించి, చక్కెర చదివింపులు చేశారు. అగ్నిగుండం వెలిగించి రాత్రంతా అలావ్ తొక్కారు. తెల్లవారు జామునే పీర్లను ఊరేగించి అగ్నిగుండ ప్రవేశంచేశారు. సాయంత్రం జలధికి తరలించారు.

రాయలసీమ విద్యార్థి సంఘం కమిటీ ఎంపిక

అనంతపురం విద్య, జూలై 24: రాయలసీమ విద్యార్థి యువజన సంఘం అనంతపురం జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్‌కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా భీమేష్, జిల్లా కార్యని ర్వాహక కార్యదర్శిగా శాంతారాజ్, కార్యవర్గసభ్యులుగా అజయ్, వంశీ, భాషా, సీను, ముత్తు, సాదిక్, రవి, జగదీష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. కొత్త సభ్యులకు ఆ సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.

ఎస్కేయూ రిజిస్ట్రార్‌కు టీఎన్‌ఎస్‌ఎఫ్ సత్కారం


రిజిస్ట్రార్ రమేష్‌బాబును సత్కరిస్తున్న టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు

అనంతపురం సెంట్రల్, జూలై 24: ఇటీవల ఎస్కేయూ రిజిస్ట్రార్‌గా నూతన బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రమేష్ బాబును బుధవారం టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు సురేంద్రనాయుడు, మారెన్న, నాగేంద్ర, రాజు, మనోహర్ ఘనంగా సత్కరించారు. అనంతరం వారు ఇన్‌చార్జ్ వీసీ అనితను కలిసి విద్యార్థుల సమస్యలపై చర్చించారు.

బీకేఎస్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

బుక్కరాయసముద్రం, జూలై 24: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ బుధవారం రాత్రి అకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని లాకప్ ఉమెన్ షెల్ఫ్‌ను, రికార్డుల నిర్వాహణను పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. గ్రామల్లో శాంతిభద్రతల గురించి చర్చించారు. సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఐ వెంకటేశ్, సిబ్బందికి సూచించారు.

ఎస్పీని కలసిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు

అనంతపురం రూరల్, జూలై 24: జిల్లా నూతన ఎస్పీ మురళీకృష్ణను జిల్లా ఎస్సీఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. వారు బుధవారం ఎస్పీకార్యాల యంలో ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కమిటీ సభ్యులు నేరమెట్ల ఎల్లన్న, బీసీఆర్ దాస్, సాకే చిరంజీవి, రామన్న, తలారి వరలక్ష్మి, మీనుగ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య

గార్లదిన్నె, జూలై24: పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య డిమాండ్ చేశారు. ఆ మేరకు యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓలు చంద్ర నాయక్, వెంకటరమణనాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శివరుద్రప్ప, రాధిక, శివమూర్తి, నాగభూషణం, రామాంజినేయులు, రేవతి, సౌజన్య, శాంతిప్రియ, వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా రికార్డులు నిర్వహించాలి

జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి

రాప్తాడు, జూలై 24: రికార్డులన సక్రమంగా నిర్వహించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి యుగంధర్ సూచించారు. రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాక్సినేషన్ నిల్వ చేసే ఐఎల్‌ఆర్, డీప్ ఫ్రీజర్, టెంపరేచర్ రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో నాటిన మొక్కలను పరిశీలించారు. మరిన్ని మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనంతరం బొమ్మేపర్తి సచివాలయంలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు.

మంత్రి లోకేశ్‌ను కలసిన దండు



శింగనమల, జూలై24: రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను తెలుగుయవత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు బుధవారం కలిశారు. విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు

వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడిగా తరిమెల హరి

శింగనమల, జూలై 24: వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడిగా తరిమెల గ్రామానికి చెందిన నల్లబోతుల హరిని నియమించినట్లు ఏపీ వాల్మీకి సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కేశవ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ... వాల్మీకులను ఎస్టీల్లో పునరుద్ధరణ కోసం పోరాడుతామని తెలిపారు.

రాష్ట్ర సాఫ్ట్‌బాల్ జట్టుకు మున్సిపల్ స్కూల్ విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అనంతపురం విద్య, జూలై 24: నగరంలోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి సురేష్ రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సురేష్ ఇటీవల ఆర్డీటీ స్టేడియంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు స్కూల్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబు తెలిపారు. ఆ విద్యార్థిని బుధవారం పాఠశాలలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. పీడీలు జ్యోతి, హిమబిందు, పీఈటీ మధు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి: డీఎంహెచ్‌ఓ


రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

గార్లదిన్నె, జూలై 24: ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ ఈబీ దేవి వైద్యులు, సి బ్బందికి సూచించారు. డీఎంహెచ్‌ఓ బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో పలు రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా గార్లదిన్నె పీహెచ్‌సీ వైద్యులు ఇద్దరు ఒక గదిలో, యర్రగుంట్ల వైద్యాధికారి మరో గదిలో ఉంటూ వైద్య సేవలం దించాలని సూచించారు. ముగ్గురూ ఒకే గదిలో ఉంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా గార్లదిన్నె పీహెచ్‌సీ లోనే ప్రసవాలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ల్యాబ్‌ను, మందుల గదిని పరిశీలించారు. రోజూ సుమారు 50 వరకు వైద్య పరీక్షలు చేస్తామని ల్యాబ్ టెక్నీషియన్ కిరణ్ తెలిపారు. పీహెచ్‌సీలో ఏవైనా సమస్యలుంటే తెలపాలని వైద్యాధికారి గౌతమికి సూచించారు. పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సులు ముగ్గురు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కరే ఉండడంతో ఇబ్బందిగా ఉందని వైద్యాధికారి డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లతానని డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు గౌతమి, మంజుల, దిలీప్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించండి

మంత్రి సవితకు సంఘం నాయకుల వినతి


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ఎంపీఈఓల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, జూలై 24 : వ్యవసాయ శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను ఎంపీఈఓల సంఘం నాయకులు కోరారు. ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు రెడ్డి ప్రసాద్, నాయకులు శంకర్, భాస్కర్ నాయక్ బుధవారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవితను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ... సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఎంపీఈఓలకు న్యాయం జరిగేలా చూస్తానని హామి ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఐదు నెలలుగా వేతనాల్లేవ్

● వేధింపులు అధికం... ఆత్మహత్యే శరణ్యం

● కలెక్టర్ వద్ద శాప్ రెజ్లింగ్ కోచ్ రాఘవేంద్ర మొర


కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసివస్తున్న రాఘవేంద్ర కుటుంబం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 24: ఐదు నెలలుగా వేతనాలు అందలేదని... దీనికి తోడు డీఎస్‌డీఓ మానసిక వేధింపులు భరించలేక పోతున్నామని శాప్ కోచ్ రాఘ వేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆయన కుటుంబంతో వెళ్లి బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసిన మొర పెట్టుకున్నారు. తాను అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాల్లో నిర్వహించిన ఇంటర్నేషనల్ రెజ్లింగ్ పోటీలకు పనిచేసి గుర్తింపు సాధించానని తెలిపారు. అయితే ఐదు నెలలుగా డీఎస్‌డీఓ పనిగట్టుకుని వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చిలో అనంతపురం నుంచి పామిడికి బదిలీ చేయగా, అక్కడికే తన మకాం మార్చానన్నారు. పామిడిలోనే పిల్లలను పాఠశాలలో చేర్పించానన్నాడు. తిరిగి ఇప్పుడు అనంతపురానికి రావాలంటే ఎలా అన్నారు. డీఎస్‌డీఓ వచ్చినప్పటి నుంచి తనతో పాటు ఇతర కోచ్‌లను వేధింపులకు గురి చేస్తున్నారని, ఆ వేధింపులను తట్టుకోలేకపోతున్నామని వివరించారు. తనకు న్యాయం జరగకపోతే కుటుంబతో కలిసి ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ...న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని కోచ్ తెలిపారు.

యోగా గురువులకు సన్మానం


యోగా గురువులను సన్మానిస్తున్న యోగా అభ్యాసకులు

అనంతపురం కల్చరల్, జూలై 24 : గురుపౌర్ణమిని పురస్కరించుకుని వివేకానంద యోగా కేంద్రం ఆధ్వర్యంలో యోగా గురువులను సన్మానించారు. మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయ కల్యాణమండపంలో బుధవారం సాయంత్రం యోగా గురువులు ఈఎస్ మారుతి ప్రసాద్, జయకర్‌ను శాలువా, పుష్పగుచ్ఛాలతో యోగా అభ్యాసకులు సత్కరించారు. కార్యక్రమంలో యోగాకేంద్ర అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, ఆంజనేయులు, తారక రామయ్య, పుల్లయ్య, శ్రీకృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీటెక్‌తో ఉజ్వల భవిష్యత్తు

జేఎన్‌టీయూ వీసీ సుదర్శన రావు



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వీసీ

అనంతపురం సెంట్రల్, జూలై 24: బీటెక్ ఇంజినీరింగ్ కోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు పేర్కొ న్నారు. స్థానిక అనంతలక్ష్మి ఇంజినీ రింగ్ కళాశాలలో బుధవారం బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. వీసీ సుదర్శన రావు, కళాశాల చైర్మన్ అనంతరాముడు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, ప్రిన్సిపాల్ రామమూర్తి, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోనాపురం చేరుకున్న పాదయాత్ర


కోనాపురం చేరుకున్న గడ్డంముత్యాలప్ప కుటుంబం

ధర్మవరం రూరల్(కనగానపల్లి), జూలై 24: రాప్తాడు ఎమ్మెల్యేగా పరిటాలసునీత విజయం సాధించాలని రామగిరికి చెందిన గడ్డం ముత్యాలప్ప అనంతపురం నుంచి నసనకోట ముత్యాలమ్మకు పాదయాత్ర చేస్తానని మొక్కుకున్నారు. ఈ మేరకు బుధవారం అనంతపురం నుంచి ఆయన కుటుంబ సభ్యులతో మొదలుపెట్టిన పాదయాత్ర బుధవారం రాత్రికి కోనాపురం చేరింది. టీడీపీ గ్రామ అధ్యక్షులు రాము, బండి ఉజ్జినప్ప, నీలప్ప, పెద్దన్న తదితరులు వారికి స్వాగతం పలికారు. నసనకోట ముత్యాలమ్మకు మొక్కు చెల్లించుకుంటామని వారు తెలిపారు.

రికార్డులను భద్రపరుచుకోవాలి: ఆర్డీఓ

ధర్మవరం రూరల్(కనగానపల్లి), జూలై24: ప్రభుత్వ కార్యాలయా ల్లో ఉండే రెవిన్యూ రికార్డులను భద్రపరుచుకోవాలని ధర్మవరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. కనగానపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డు రూమ్‌ను పరిశీలించి భద్రతపై అధికారులతో చర్చించారు. రైతుల భూములకు సంబంధించిన రికార్డులను భద్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను సత్వ రమే పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ రమాదేవి, డీటీ ప్రసాద్, ఆర్ఐ సరళ, సీఎస్‌డీటీ కవిత తదితరులు పాల్గొన్నారు.

29న సర్వసభ్య సమావేశం

యల్లనూరు, జూలై 24: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 29వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీర్రాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇందులో మండలంలో నెలకొన్న సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరుకావాలని సూచించారు.

ప్రజా కోరిక పార్టీ ఆవిర్భావం

గుంతకల్లు టౌన్, జూలై 24: పట్టణంలోని ప్రజా కోరిక పార్టీని ఆవిర్భావం చేసినట్లు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగాధర్ తెలిపారు. స్థానిక పాతగుత్తిరోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజాస్వామ్య పాలనలో వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి దశలో ప్రజలకు భాగస్వామ్యాన్ని కల్పించడం, ప్రభుత్వ పాలన అంతా పూర్తిగా అధికారిక భాష తెలుగులో జరిగేలా చూడటం, అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలలో మార్పు తీసుకురావడం తదితర వాటి కోసం ప్రజా కోరిక పార్టీ పనిచేస్తుందని తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

గుంతకల్లు టౌన్, జూలై 24: పట్టణంలోని మార్కెట్ రోడ్డులో మురుగు కాలువలపై ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య మాట్లాడుతూ మురుగు కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేయడంతో మురుగునీరు వెళ్లడం లేదన్నారు. దీంతో అపరిశుభ్రత నెలకొంటోందన్నారు. అందుకే వాటిపై ఆక్రమణలు తొలగించామన్నారు. కార్యక్రమంలో ఏసీపీ సత్తార్, టీపీఎస్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.19.78లక్షలు

గుంతకల్లు టౌన్, జూలై 24: పట్టణంలోని పాతగుంతకల్లులో వెలసిన హజరత్ సయ్యద్ మస్తాన్ వలి దర్గాలో భక్తులు హుండీల్లో వేసిన కానుకలను లెక్కింపు చేపట్టగా రూ. 19.78లక్షల ఆదాయం వచ్చిందని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ రహీంహుసేన్ తెలిపారు. వక్ఫ్‌బోర్డు అధికారులు ఆధ్వర్యంలో మంగళవారం దర్గాలోని 10 హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఒక సంవత్సరం పాటు భక్తులు హుండీల్లో వేసిన కానుకలను లెక్కించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రామసుబ్బారెడ్డి, ఎల్లార్తి దర్గా ఈఓ ఇమ్రాన్, వీఆర్వోలు, దర్గా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు దరఖాస్తు చేసుకోండి

యాడికి, జూలై 24: ఉపాధిహామీ పథకం ద్వారా ఉద్యానపంటల సాగుకోసం అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చునని ఏపీఓ రమేష్ సూచించారు. మండల కేంద్రంలోని సమావేశభవనంలో బుధవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అర్హులైన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చేయాల్సిన బాధ్యత ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై ఉందని తెలిపారు. 5ఎకరాల్లోపు భూమి కలిగి ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులన్నారు. నేరేడు, నిమ్మ, చీనీ, దానిమ్మ, మామిడి వంటి మొక్కలను రైతులు సాగు చేసుకోవచ్చన్నారు. పూర్తివివరాల కోసం ఉపాధిహామీ పథకం కార్యాలయంలో గానీ, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌ను గానీ సంప్రదించాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తిరూరల్, జూలై 24: బసినేపల్లి గ్రామశివారులోని రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. బసినేపల్లికి చెందిన కృష్ణారెడ్డి బైక్‌పై నంద్యాల జిల్లా తుగ్గలికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. గ్రామ శివారులోకి రాగానే బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

27న ఐటీఐలో ప్రవేశానికి కౌన్సెలింగ్

గుంతకల్లుటౌన్, జూలై 24: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశం కొరకు రెండో విడత కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 27వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ సీహెచ్ విద్యాసాగర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో 27వ తేదీ ఉదయం 10గంటలకు ఐటీఐలో హాజరుకావాలని సూచించారు.

చౌకధాన్యపు డిపో తనిఖీ

బెళుగుప్ప, జూలై 24: మండల కేంద్రంలోని చౌకధాన్యపు డిపో-2ను డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్ పీరా, వీఆర్వోలు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇక్కడ డీలర్ నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని, సరిగా అందుబాటులో ఉండటం లేదని లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు అందడంతో వారు తనిఖీ చేశారు. స్టాక్ నిల్వలు, బఫర్ రికార్డులను పరిశీలించి విచారణ చేపట్టారు. వీఆర్వోలు యర్రిస్వామి, వీరాంజనేయులు, వెన్నెల, నాగేంద్ర పాల్గొన్నారు.

31న మండల సర్వసభ్య సమావేశం

బెళుగుప్ప, జూలై 24: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 31వ తేదీ మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు బుధవారం ఎంపీడీవో సుబ్బరాజు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని అధికారులు ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

అయ్యంకి వెంకటరమణయ్య జయంతి

యల్లనూరు, జూలై 24: ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తుడు, గ్రంథాలయ పితామహుడిగా పేరుగాంచిన పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని మండలకేంద్రంలోని గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ప్రకాష్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

గొంగళి పురుగు నివారణకు చర్యలు చేపట్టండి

కూడేరు, జూలై 24: ఉదిరిపికొండ, మరుట్ల, తిమ్మాపురం గ్రామాల్లో ముందస్తు వర్షాలకు సాగు చేసిన వేరుశనగ, కంది, ఆముదం పంటలను ఏఓ విజయ్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటలకు గొంగళి పురుగు ఆశిస్తుండడాన్ని గమనించామని, నివారణకు చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. వేపనూనెతోపాటు ప్రొపెనోఫాస్ మందు 1.5 ఎంఎల్‌ను లీటర్ నీటిలో కలుపుకుని పిచికారీ చేయాలని తెలిపారు.

బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అన్యాయం

గుత్తి, జూలై 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని రైల్వే మజ్దూర్ యూనియన్ ఏడీఎస్ నారాయణ, డీజిల్‌షెడ్ బ్రాంచ్ సెక్రెటరీ రామాంజనేయులు రెడ్డి, చైర్మన్ నరసింహులు బుధవారం ప్రకటనలో తెలిపారు. కొత్తపెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని గత కొన్నేళ్లుగా ఆందోళనలు చేస్తున్నామన్నారు. ఈ బడ్జెట్‌లో కూడా ఓపీఎస్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో తమకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ అంశాలపైన డివిజన్ నాయకులతో చర్చించి ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదు: ఆర్డీఓ

కళ్యాణదుర్గం రూరల్, జూలై 24 : ఎవరూ కూడా మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదని ఆర్డీఓ రాణి సుస్మిత సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్డీఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మత్తుపదార్థాలైన ఆల్కహాల్, పొగాకు, గంజాయి లాంటివాటి వినియోగం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా యువత వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. వాటికి అలవాటు పడితే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. కనుక వాటి జోలికి ఎవరూ వెళ్లరాదని సూచించారు. ప్రిన్సిపాల్ మల్లికార్జున , సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్ల జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. అప్పుడే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకటేష్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాణి సుష్మిత

మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలి

రాయదుర్గం రూరల్, జూలై 24 : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునః ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమంతరాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఆంజినేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం విద్యార్థులతో కలిసి గంటపాటు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019కి ముందు టీడీపీ హయాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అందేదన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పథకానికి స్వస్తి చెప్పిందన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే పథకాన్ని పునః ప్రారంభించాలని కోరారు. అదే విధంగా సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. అనంతరం తహసీల్దార్ చిట్టిబాబుకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు అభిషేక్, కార్తీక్, విఠల్, మధు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ కోరారు. ఈ మేరకు ఆయన విద్యార్థులు, సంఘం నాయకులతో కలిసి ఆర్డీవో రాణిసుస్మితకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కళాశాలల్లో నడుస్తుండే మధ్యాహ్న భోజన పథకం వైసీపీ ప్రభుత్వం వచ్చాక రద్దు అయిందన్నారు. కూటమి ప్రభుత్వం మళ్లీ పునఃప్రారంభించాలని కోరారు. అనంతరం ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గణేష్, కార్యదర్శిగా ధనుష్, సహాయ కార్యదర్శిగా రాకేష్‌తో పాటు పలువురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.


రాయదుర్గం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు

అభివృద్ధి పనుల్లో అక్రమాలు జరిగాయి

● పంచాయతీ సమావేశంలో టీడీపీ మద్దతు వార్డు సభ్యులు

ఉరవకొండ, జూలై 24: అభివృద్ధి పనులు చేయకుండానే చేసినట్లు చూపి బిల్లులు స్వాహా చేశారని, అందుకు బాధ్యులైన వైసీపీ మద్దతు సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేయాలని టీడీపీ మద్దతు వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం పంచాయతీ సర్వసభ్యసమావేశం సర్పంచ్ లలితమ్మ అధ్యక్షతన జరిగింది. అజెండాలోని అంశాలపై వార్డు సభ్యులు చర్చ మొదలుపెట్టారు. వైసీపీ హయాంలో రోడ్లను నాసిరకంగా వేశారని, నాణ్యత ఎక్కడా కనిపించడం లేదని, ఏడాది లోపే రోడ్లన్నీ దెబ్బతిన్నాయని, రోడ్ల నాణ్యతపై క్వాలిటీ కంట్రోల్ అధికారులతో విచారణ చేయించాలని వార్డు సభ్యుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. డ్రైనేజీల్లో పారిశుధ్యపనులు చేపట్టకనే, చేపట్టినట్లు ఎలా బిల్లులు డ్రా చేస్తారంటూ మరో వార్డు సభ్యుడు ప్రభాకర్ ఈవో గౌస్‌ను నిలదీశారు. కరిబసప్పస్వామి రథోత్సవానికి రూ.4లక్షలు ఎలా ఖర్చు అయ్యాయో బిల్లులు చూపాలని సభ్యులు పట్టుపట్టారు. అనంతరం అజెండాలో పెట్టిన బిల్లులను వ్యతిరేకిస్తూ టీడీపీ మద్దతు వార్డు సభ్యులు సమావేశాన్ని బహిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పంచాయతీలో అవకతవకలు జరిగాయని గత సమావేశాల్లోనే చెప్పామన్నారు. సాధారణ సమావేశాలను నిర్వహించకుండా దాటవేస్తూ, 8నెలలకు సంబంధించిన బిల్లులను ఒకేసారి ఆమోదింపజేసేందుకు ప్రయత్నించారన్నారు. పంచాయతీలో జరిగిన అక్రమాలపై నిజానిజాలను నిగ్గుతేల్చాలన్నారు. అక్రమాలపై డీపీవో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పంచాయతీ అక్రమాలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. సమావేశంలో టీడీపీ వార్డు సభ్యులు నిరంజన్‌గౌడ్, వాసు, రవి, మాధవి, జానకి పాల్గొన్నారు.


పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వార్డు సభ్యులు

ఇకే ఇంట్లో రెండు పింఛన్లు..

● తొలగించాలని ఈఓఆర్డీకి టీడీపీ యూత్ వినతి

బొమ్మనహాళ్, జూలై 24 : మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో మాజీ వలంటీరు నిఖిల తన కుటుంబానికి రెండు పింఛన్లు మంజూరు చేయించుకుందని, వెంటనే తొలగించాలని కోరుతూ టీడీపీ యూత్ నాయకులు బుధవారం మండలకేంద్రంలో ఈఓఆర్డీ దాస్‌కు వినతిపత్రం అందించారు. గత వైసీపీ ప్రభుత్వంలో వలంటరీగా ఉన్న నిఖిల తన తల్లిదండ్రులైన కమలమ్మ, మల్లికార్జునకు పింఛన్లు మంజూరు చేయించారన్నారు. ఒకే ఇంట్లో రెండు పింఛన్లు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. 2021 నుంచి వారు అక్రమంగా పించన్ తీసుకుంటున్నారని తెలిపారు. గ్రామంలో ఇలాంటివి ఇంకా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో రవి, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

యల్లనూరు, జూలై 24: మండలంలోని చింతకాయమంద గ్రామంలో బుధవారం మధ్యాహ్నం పోలీసులు కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు పోలీసులు గ్రామంలో రామాంజనేయులు అనే వ్యక్తి ఇంటిపై దాడులు చేశారు. ఇంట్లో నిల్వ ఉన్న 384 టెట్రా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే రామాంజనేయులును అదుపులోకి తీసుకున్నారు. మద్యంను స్వాధీనం చేసుకున్న సిబ్బందిని రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం అభినందించారు.

నియోజకవర్గ స్థాయి సమావేశం

తాడిపత్రి, జూలై 24: పట్టణంలోని రంగప్పకాలనీలో బుధవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య మాట్లాడుతూ కరువు జిల్లా అనంతపురానికి ఉపాధిహామీ పథకం వరంలాంటిదన్నారు. ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి వలసలను ఆపాలన్నారు. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వీటీ రామాంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులపై దాడులను అరికట్టాలి

గుంతకల్లుటౌన్, జూలై24: విద్యార్థినులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు అరికట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. విద్యార్థినులపై దాడులకు నిరసనగా బుధవారం వారు పట్టణంలో పలు కళాశాల విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. స్థానిక పొట్టిశ్రీరాముల సర్కిల్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, జిల్లా మహిళా కన్వీనర్ రజిత మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్రంలో విద్యార్థినులపై దాడులు అధికమయ్యాయన్నారు. ఢిల్లీలోని జేఎన్‌యూనివర్శిటీలోనూ విద్యార్థినులపై పాశవికంగా దాడులు జరుగుతున్నాయన్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నోరు మెదపకపోడం శోచనీయమన్నారు. విద్యార్థినులు, బాలికలపై దాడులు పునరావృతం కాకుండా చూడాలని, అలా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వైటీసీ రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ, చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

గుత్తి, జూలై 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రాభివృద్ధికి పెద్దపీట వేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ టీడీపీ శ్రేణులు బుధవారం పట్టణంలోని గాంధీ సర్కిల్లో పార్టీ గుత్తి ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గుమ్మనూరు నారాయణ మాట్లాడుతూ కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రాభివృద్ధికి రూ. 15వేల కోట్లు కేటాయించడం శుభపరిణామమన్నారు. అంతకుముందు వారు స్థానిక గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్‌జిలాన్, డైరెక్టర్లు కృష్ణ, వీరన్న, టీడీపీ నాయకులు ఎంకే చౌదరి, బద్రివలి, రవి, దిల్కాశీనా, సంపత్‌కుమార్, న్యాయవాది సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

నిధుల మంజూరుపై హర్షం

తాడిపత్రి: కేంద్ర బడ్జెట్‌లో అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు కేటాయించడంపై అనంతపురం పార్లమెంట్ తెలుగురైతు ప్రధాన కార్యదర్శి యుగంధర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. నిధుల మంజూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన కృషే కారణమని తెలిపారు.

తాగునీటిని సరఫరా చేయాలని మంత్రికి వినతి

పుట్లూరు, జూలై 24: గండికోట రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా పుట్లూరు, యల్లనూరు మండలాలకు నీటిని సరఫరా చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, మండల మాజీ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి తదితరులు రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు విన్నవించారు. విజయవాడలో బుధవారం వారు మంత్రిని కలిసి సమస్యను విన్నవించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌నాయుడు తదితరులు ఉన్నారు.

ఆదాయపు పన్ను దినోత్సవం

రాయదుర్గంరూరల్, జూలై 24: పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఆదాయపు పన్ను దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ రఘురామమూర్తి మాట్లాడుతూ ఇన్‌కంట్యాక్స్ అనేది నిత్యజీవితంలో ఒక భాగం అని, ప్రభుత్వాలు ప్రజా అవసరాలను తీర్చాలన్నా, ప్రజలకు సౌకర్యాలను కల్పించాలన్నా, ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలన్నా, ఆదాయం కలిగి ఉన్న ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ట్యాక్స్ చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వీ శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

బొమ్మనహాళ్, జూలై 24: మొక్కలను నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండాపురం కేశవరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో బుధవారం టీడీపీ నాయకుడు పయ్యావుల అనిల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. వారు ముఖ్యఅతిథులుగా హాజరై మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మండల కన్వీనర్ బలరాంరెడ్డి, హెచ్ఎం రాజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

నగరవనం పరిశీలన


కళ్యాణదుర్గం, జూలై 24: పట్టణంలోని నగరవనంను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మేనల్లుడు ధర్మతేజ, అటవీశాఖ అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నగరవనంను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇక్కడ పచ్చదనం పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలను అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై విచారణ

బెళుగుప్ప, జూలై 24: మండలంలోని వెంకటాద్రిపల్లి అంగన్‌వాడీ కార్యకర్తపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ బుధవారం విచారణ చేపట్టారు. కార్యకర్త అంగన్‌వాడీ కేంద్రానికి సరిగా రాకపోవడంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం సమయపాలన పాటించని అంగన్‌వాడీ సిబ్బంది అన్న శీర్షికన కథనం వెలువడింది. ఇందుకు స్పందించిన సూపర్‌వైజర్ వెంటనే ఆ కేంద్రానికి వెళ్లి కార్యకర్త పట్ల పట్ల చిన్నారుల తల్లులు, గర్భిణులను విచారించారు. ఇక్కడ మూడేళ్లుగా ఆయాను నియమించలేదని, కనుక పిల్లలకు తామే ఇంట్లో మెనూ ప్రకారం భోజనం వండుకుని తేవాల్సి వస్తోందని, దీంతో పాటు బైకు చెడిపోవడంతో ఆలస్యంగా విధులకు హాజరు కావాల్సి వచ్చిందని కార్యకర్త వివరణ ఇచ్చినట్లు సూపర్‌వైజర్ తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆయాను నియమించేలా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

సీఎంతో జితేంద్రగౌడ్ భేటీ

గుంతకల్లు, జూలై 24: ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ జితేంద్రగౌడ్ బుధవారం ఉదయం భేటీ అయ్యారు. అమరావతిలోని సచివాలయంలో ఆయన సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీ శ్రీనివాసరావును, పితాని సత్య నారాయణను కూడా కలిశారు. కార్యక్రమంలో టీడీపీ అనంతపురం పార్లమెంటు కమిటీ ఉపాధ్యక్షుడు కేశప్ప, నాయకులు రవి శంకర్ గౌడ్, వీరభద్రయ్య, సురేశ్ పాల్గొన్నారు.


సీఎంతో మాట్లాడుతున్న జితేంద్రగౌడ్

కందిపంట పరిశీలన

రాయదుర్గం రూరల్, జూలై 24: మండలంలోని ఆర్‌బీవంక గ్రామంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన కందిపంటను జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. గ్రామంలో 55 ఎకరాల్లో రైతులు కందిపంట సాగుచేసినట్లు తెలిపారు. పంటకు సోకే తెగుళ్ల, వాటి నివారణ గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. కందిపంటలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆశించవచ్చన్నారు. అతి తక్కువ వర్షపాతానికి కూడా తట్టుకునే శక్తి ఈపంటకు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మానాయక్, రైతులు జయరాంనాయక్, హేమ్లానాయక్, నరేంద్రనాయక్, శివశరణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి కోసం రాస్తారోకో

విడపనకల్లు, జూలై 24: నెల రోజులుగా తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే సమస్య తీర్చాలంటూ మండల కేంద్రంలోని వివిధ కాలనీలకు చెందిన మహిళలు స్థానిక 42వ జాతీయ రహదారిపై బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నెల రోజులైనా తాగేందుకు చుక్క నీరు రావడం లేదన్నారు. దీంతో దాహార్తితో అల్లాడుతున్నామన్నారు. సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదన్నారు. అందుకే రాస్తారోకో చేపట్టామని తెలిపారు. రాస్తారోకోతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎస్ఐ ఖాజా హుస్సేన్ రాస్తారోకో వద్దకు చేరుకని మహిళలతో చర్చించారు. కాలనీలకు తాగు నీరు ఇచ్చే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. అయితే వారు ససేమిరా అనడంతో ఎంపీడీఓ కొండయ్య, ఎస్ఓ భాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ధనుంజయ రాస్తా రోకో వద్దకు వచ్చి ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు రాస్తారోకో విరమించారు.


రాస్తారోకో చేస్తున్న మహిళలు

నేటి అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి..

● ప్రకటన చేసిన శ్రీరామిరెడ్డి కార్మికులు

కళ్యాణదుర్గం రూరల్, జూలై 24: తమ డిమాండ్ల సాధనకు తామంతా గురువారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లనున్నామని కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు నరేష్, అల్లాబకాష్, రాము, అశోక్ తదితరులు బుధవారం ప్రకటించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 185 మంది కార్మికులు 20 ఏళ్లగా పని చేస్తున్నామని, అయితే తమ డిమాండ్ల సాధన కోసం గతంలో అనేక ఆందోళనలు చేశామని అన్నారు. ఈ నెల 10వ తేదీ కూడా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశామన్నారు. వినతిపత్రాన్ని అందించి 15 రోజులు కావస్తున్నా ఏ ఒక్క సమస్య తీర్చలేదన్నారు. దీంతో సమ్మెలోకి వెళుతున్నట్లు ప్రకటించారు. బకాయి వేతనాలు చెల్లించాలని, 25 నెలల పీఎఫ్ చెల్లించాలని , తొలగించిన 21 మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు సమ్మెలోకి వెళుతున్నట్లు వారు తెలిపారు.

నేడు కంటివైద్య శిబిరం

యాడికి, జూలై 24: మండలంలోని రాయలచెరువులోని లయన్స్‌క్లబ్ కార్యాలయంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు సూర్యనారాయణ బుధవారం పకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు, లయన్స్‌క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

తాడిపత్రి, జూలై 24: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ సాజిదాబేగం మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినట్లు తెలిస్తే 1098కి సమాచారం అందించాలన్నారు. బాగా చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. గృహహింస, పోక్సో చట్టం గురించి వివరించారు. సదస్సులో సూపర్‌వైజర్లు, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

యాడికి, జూలై 24: వ్యవసాయ సిబ్బంది రైతు సేవా కేంద్రాల్లో అందుబాటు లో ఉండి రైతులకు మెరుగైన సేవలు అందించాలని మండల వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా సూచించారు. మండలకేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో వ్యవసాయ సిబ్బంది రైతు సేవా కేంద్రాల్లోనే అందుబాటులో ఉండి రైతులకు సేవలు అందించాలని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్‌లో వర్షపాతం తక్కువగా ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధమయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఆయన స్థానిక ఫర్టిలైజర్స్ దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకే ఎరువులు, మందులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు. ప్రతినెలా ఫర్టిలైజర్స్ దుకాణాల తనిఖీలు ఉంటాయని, రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తే దుకాణాలను సీజ్‌చేస్తామని హెచ్చరించారు.

అవకతవకలపై విచారణ

కుందుర్పి, జూలై 24: మండలంలోని అపిలేపల్లిలో రైతుల పరస్పర సహాయక సహకార సంఘంలో జరిగిన అవకతవకలపై బుధవారం విచారణ జరిగింది. గ్రామంలో గత ఎనిమిది ఏళ్ల క్రితం రైతులు ఆ సంఘాన్ని ఏర్పాటు చేసుకుని, సభ్యత్వం కింద దాదాపు రూ. 11 లక్షలను బ్యాంకులో జమ చేశారు. అంతేకాకుండా ట్రాక్టర్, ఇతర వ్యవసాయ పనిముట్లు, ఆఫీసు పరికరాలు కొనుగోలు చేసి ఉపయోగించుకుంటున్నారు. నాలుగేళ్ల పాటు అంతా సజావుగా సాగింది. అయితే బీవోడీ మెంబర్లు, సిబ్బంది సంఘాన్ని సరిగా నడవకపోవడంతో పరిస్థితి మారిపోయింది. దీంతో నగదును, యంత్ర పరికరాలను ఎవరికి వారే స్వాధీనం చేసుకున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి ప్రయోజనం లేకపోవడంతో ఇటీవల గ్రామస్థులు, సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏడీ యల్లప్ప గ్రామ సచివాలయంలో రైతు పరస్పర సహకార సంఘ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి అవకతవకలపై విచారణ జరిపారు. యంత్ర పరికరాలు, ఇతర పనిముట్లు స్వాధీనం చేయాలని, ఎవరైతే నగదును వినియోగించుకున్నారో ఆ నగదును రెండో తేదీ లోగా బ్యాంకులో జమ చేయాలని సూచించారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.